## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, జడ్పీచైర్‌పర్సన్ సునితామహేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

- విద్యార్థులకు దుస్తులు, పుస్తకాల పంపిణీ
- త్వరలోనే మేగా డీఎస్సీ నిర్వహణ
- రాష్ట్ర శాసనసభపతి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు, జూన్ 12 : పభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, త్వరలోనే మెగా డీఎస్సీ చేపడుతామని, దీంతో ఉపాధ్యాయుల కొరత తీరనున్నదని రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కెరెళ్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నద న్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందించడం జరుగుతున్నదన్నారు. పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థులకు డిజిటల్ విద్య అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించామన్నారు. తెలంగాణలో 26,872 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మరమ్మతులు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. సర్కారు బడిలో చదివిన వారెందరో ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పెద్దల సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్యభట్టు మాట్లాడుతూ విద్య ఉంటే ఏదైనా సాధించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం టీవీల ద్వారా విద్యార్థులకు అత్యున్నత విద్యను అందించేందుకు కృషి చేస్తున్నద న్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి, ఆర్డీవో వాసుచంద్ర, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రయ్య, ఎంపీడీవో నర్సింహులు, తహసీల్దార్ సాజీదాబేగం, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్, మండల విద్యాధికారి బాబుసింగ్, ఎంపీటీసీలు, ప్రజాప్రతి నిధులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ధారూరు మండల కేంద్రంలో..**

బడిబాట కార్యక్రమంలో భాగంగా ధారూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను ధారూరు జడ్పీటీసీ సుజాత, నాయకులు చంద్రమౌళి, ఉపాధ్యాయులు అందజేశారు.



పాఠశాలలు షురూ అయ్యాయి. పలు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. మోటారు వాహనాల చట్టం నిబంధనల మేరకు ఏటా బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఫిట్‌నెస్ లేని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డుపై నడిపిస్తే సీజ్‌చేస్తామని సంబంధిత రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నా పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

# బడి బస్సు భద్రమేనా ?

### ప్రైవేటు పాఠశాలల్లో కాలం చెల్లిన బస్సులు.. అనుభవంలేని డ్రైవర్లు

ఇబ్రహీంపట్నం రూరల్, జూన్ 11 : ధనార్జనే ధ్యేయంగా పలు ప్రైవేటు పాఠశాలల యజమానులు ఫిట్‌నెస్‌లేని వాహనాలను వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డొక్కు బస్సులకు రంగులద్ది పల్లెలకు పంపిస్తున్నారు. ఇలాంటి వాహనాల్లో విద్యార్థులను పాఠశాలలకు పంపించాలంటే పల్లెవాసులు జంకుతున్నారు. మరి కొన్ని విద్యాసంస్థలు కేవలం డబ్బు కోసమే పాఠశాలలను నడుపుతూ జీపులు, ఆటోల్లో విద్యార్థులను తీసుకెళ్తున్నారు. తల్లిదండ్రుల వద్ద వేలకువేలు దండుకుంటూ ఫిట్‌నెస్ లేని బస్సులను నడుపుతున్నారు. దీంతో పాటు తక్కువ వేతనాలకు పనిచేసే అనుభవంలేని డ్రైవర్లను నియమించుకుని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. సీట్లకు మించి విద్యార్థులను ఎక్కించవద్దనే నిబంధన ఉన్నప్పటికీ కొన్ని పాఠశాలల వాహనాల్లో అయితే విద్యార్థులు డోర్ వద్ద వేలాడుతూ ప్రయాణిస్తుండడం బాధాకరం. ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు తిరిగి ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులకు ఆందోళనకు గురికావడం తప్పడం లేదు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఉన్న చాలా పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల్లో వాహనాలకు సంబంధించి కనీస నిబంధనలను పాటించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### ఫిట్‌నెస్‌లేని బస్సులు నడిపిస్తే చర్యలు తప్పవు..



ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రైవర్, అటెండర్ ఎలాంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు సేవించకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్కూల్ యాజమాన్యాలదే. విద్యార్థులను సురక్షితంగా పాఠశాలలకు చేరవేయడంతో పాటు తిరిగి ఇంటికి తీసుకురావాలి. నేటి నుంచి తనిఖీలు నిర్వహించి 15 ఏండ్లు దాటిన స్కూల్‌బస్సులను నడుపొద్దు.. పట్టుబడితే సీజ్ చేస్తాం.

– సుబాష్‌చంద్రారెడ్డి, ఆర్టీఏ ఇబ్రహీంపట్నం

### స్కూల్ బస్సుల నిబంధనలు..

సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం ఒక బస్సు రోడ్డు ఎక్కాలంటే తప్పనిసరిగా 32 నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అందులో ఫిట్‌నెస్, టైర్లు, సాంకేతిక సామర్థ్యం తదితర అంశాలపై సంతృప్తి చెందితేనే సర్టిఫికెట్ జారీ చేస్తారు. అందులో కొన్ని ఇలా ఉన్నాయి..

- ప్రతి స్కూల్ బస్సు 40కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ దాటొద్దు
- బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ బాక్స్, ఫైర్ ఎగ్జిస్టింగ్ ఉండాలి
- సీట్లకు మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు
- అద్దాలు ఇరువైపులా బస్సు లోపల, బయట ఏర్పాటు చేయాలి
- బస్సు తలుపులకు లాక్ సిస్టం, విద్యార్థులు చేతులు, తల బయటపెట్టకుండా కిటికీలకు గ్రీల్స్ ఉండాలి
- పదిహేనేండ్లు పైబడిన బస్సులు నడపరాదు
- డ్రైవర్‌కు ఐదేండ్ల అనుభవం, లైసెన్స్ కలిగి ఉండాలి
- అరవైఏండ్లు నిండిన డ్రైవర్లు అర్హులు కాదు
- డ్రైవర్లను విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఎంపిక చేయాలి
- ఎప్పటికప్పుడు పాఠశాల యాజమాన్య నిర్వాహకులు పర్యవేక్షించాలి
- బస్సుకు పసుపుపచ్చ రంగుతో పాటు విద్యార్థుల బొమ్మలు వేయాలి
- రోజువారిగా బస్సుడ్రైవర్ ఇంజిన్, బ్రేకులను పరిక్షించాకే బస్సును బయటకు తీయాలి
- డ్రైవర్‌కు ఎలాంటి మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉండొద్దు
- బస్సులో డ్రైవర్‌తో పాటు అటెండరు ఉండాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం కచ్చితంగా ఉండాలి.



బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

## మంచిరెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్, జూన్ 12 : బీఆర్ఎస్ పార్టీ తరఫున మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌రెడ్డి బుధవారం బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి నవీన్‌రెడ్డిని అభినందించారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని శాసనమండలి ఎన్నికల్లో విజయాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని మాజీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**నేడు ప్రమాణస్వీకారం..**

షాద్‌నగర్ : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గురువారం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో ఉదయం 10గంటలకు ప్రమాణస్వీకారం చేస్తారని షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అభిమానులు నవీన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించిన జడ్పీసీఈవో



మంచాలలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జడ్పీసీఈవో

మంచాల, జూన్ 12 : పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలను జాగ్రత్తగా కాపాడాలని జడ్పీసీఈవో సీఎచ్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్‌యార్డు, వన నర్సరీలను ఆయన సందర్శించారు. మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించి ఎరువును తయారు చేయాలన్నారు. జడ్పీసీఈవో వెంట ఎంపీడీవో బాలశంకర్, లింగంపల్లి, నోముల, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

### బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక

వికారాబాద్, జూన్ 12 : బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు జిల్లా నుంచి విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మల్లేశం తెలిపారు. బుధవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో అభ్యర్థుల ఎంపిక చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గిరిజన విద్యార్థిని/విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించుటకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ 2024–25 పథకం ద్వారా 3వ, 5వ, 8వ తరగతుల్లో అడ్మిషన్ కోసం 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. 36 సీట్లకు గాను డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎస్టీ చెంచులు, లంబాడీల బాల, బాలికలను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా సహాయ కలెక్టర్, ఏవో భువనేశ్వరిదేవి, జూనియర్ అసిస్టెంట్ ఏ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమ ఆనవాళ్లను చెరిపేందుకు కుట్ర


షాద్‌నగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహంపై రాజకీయం

పురాతన విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నం

అడ్డుకున్న ఉద్యమకారులు

షాద్‌నగర్ రూరల్, జూన్ 12 : తెలంగాణ ఉద్యమ ఆనవాళ్లను చెరిపేందుకు పలువురు స్వార్థ రాజకీయలకు పాల్పడుతున్నారని ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయం ఎదుట ప్రొఫెసర్ జయశంకర్‌సార్ విగ్రహాన్ని 2014లో నాటి మంత్రి, ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, అంజయ్య యాదవ్, ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వివిధ ప్రజా సంఘాల టీజేఏసీ నాయకులు కలిసి ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే ఈ విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ వర్గానికి చెందిన ప్రజాసంఘాల నాయకులు బుధవారం ప్రయత్నించారు. గమనించిన గతంలో టీజేఏసీలో పనిచేసిన ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్ అడ్డుకున్నారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# సమగ్ర బీసీ కుల గణన నిర్వహించాలి



బీసీల మహాధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ తదితరులు

- ఈ నెల 15న బీసీల మహాధర్నాను విజయవంతం చేయండి
- బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్

ఆమనగల్లు, జూన్ 12 : రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో సమగ్ర కుల గణన చేపట్టాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల కేంద్రంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీసీ జనసభ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ కుల సంఘాల సమావేశానికి రాజారాం యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకోకుండా కులగణనకు చట్టబద్ధత కల్పించాలన్నారు. కుల గణన నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిన బీహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకుని విధివిధానాల కోసం నిపుణుల కమిటీ వేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీసీ జనసభ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలన్నారు. అసెంబ్లీ ఎన్నిలకు ముందు ఓ మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట.. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. బీసీ కమిషన్‌ను అడ్డం పెట్టి న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టి బీసీల గొంతు కోసే కుట్ర జరుగుతున్నదని అన్నారు. బీసీ డిక్లరేషన్ చేయకుండా ఎన్నికలకు వెళ్తే తగిన బుద్ధి చెబుతామని బీసీ సంఘాల నాయకులు కోట శ్రీనివాస్, ఎంగలి రఘు హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేస్తామని రాహుల్ గాంధీ పార్లమెంట్ ఎన్నికల్లో హామీ ఇచ్చినందుకే 99 ఎంపీ సీట్లు వచ్చిన విషయాన్ని మర్చిపోకూడదని గుర్తు చేశారు. జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసినందుకే అధికారం కోల్పోయిందన్నారు. మళ్లీ మోసం చేస్తే బీసీలందరం ఏకమై బుద్ధి చెబుతామన్నారు. ఈ నెల 15న ఇందిరా పార్కు వద్ద బీసీ జన సభ తలపెట్టిన మహాధర్నాకు బీసీలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ బీసీ సంఘం నాయకులు సైదులు గౌడ్, ఆనంద్, రాఘవేందర్, మురళి, ఎల్లప్ప, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

### మంబాపూర్, మన్సాన్‌పల్లి గ్రామాల ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎల్పీవో శంకర్‌నాయక్

పెద్దేముల్, జూన్ 12 : గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగేలా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలతోపాటు వేటు తప్పదని తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మంభాపూర్, మన్సాన్‌పల్లి గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే, పాఠశాలల్లో మరమ్మతు పనులను పరిశీలించారు. మన్సాన్‌పల్లి గ్రామానికి చేరుకున్న సమయంలో పంచాయతీ కార్యాలయం మూసి ఉన్నది. తదుపరి గ్రామస్తులతో డీఎల్పీవో మాట్లాడగా గ్రామస్తులు ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకొచ్చారు. అందులో గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రామానికి సరిగ్గా రావడం లేదని, వారం రోజులకు ఒకసారి వస్తున్నాడని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, ఏదైనా అవసరమైతే నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణను పట్టించుకోవడం లేదని, మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీలు ఉన్నాయని గ్రామస్తులు లిఖితపూర్వకంగా డీఎల్పీవోకు ఫిర్యాదు చేశారు. సుమారు గంట దాటిన తరువాత పంచాయతీ కార్యదర్శి గ్రామానికి రాగా ఆయనను డీఎల్పీవో గ్రామ సమస్యలపై నిలదీశారు. లేట్‌గా రావడంపై అసహనంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ విషయమై డీపీవోతో డీఎల్పీవో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలిపారు. త్వరలో సుజిత్ కుమార్‌పై కలెక్టర్‌కు నివేదిక సమర్పించి చర్యలు తీసుకొనేలా చూస్తానన్నారు. అంతకు ముందు పాఠశాలలో పనులను పరిశీలిస్తూ పారిశుధ్య పనులు బాగలేవని, మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించారు. ఆయన వెంట మండల ఎంపీవో రమేశ్ కుమార్, గ్రామ యువకులు, మాజీసర్పంచ్ రుక్కిబాయి, పాఠశాల హెచ్ఎం షరీఫ్ ఉన్నారు.



మన్సాన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సుజిత్‌కుమార్ విధులకు లేటుగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తాండూరు డీఎల్పీవో శంకర్ నాయక్

## విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకోవాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

వికారాబాద్, జూన్ 12 : విద్యార్థులు గొప్ప లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌లను ఎంపీ అందజేసి మాట్లాడారు. ఎంపీగా గెలుపొంది పాఠశాలకు ముఖ్యఅతిథిగా రావడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సర్కారు బడుల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకిర్‌అహ్మద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూన్ 12 : గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన తెలంగాణ రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖచే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలు–2025 కోసం తెలంగాణ రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ, బీసీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ద్వారా రెసిడెన్సియల్ పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గైడెన్స్ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అభ్యర్థులను అబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించరాదన్నారు. అభ్యర్థులు <http://studycircle.cgg.gov.in> లో లాగిన్ అయ్యి తేదీ 13-06-2024 నుంచి 30-06-2024 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్, సూచనలు <http://studycircle.cgg.gov.in> లేదా <http://twd.telangana.gov.in> వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6281766534 నంబర్‌ను అన్ని పని దినాలలో ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు సంప్రదించవచ్చన్నారు.

## సర్వే నుంచి అంగన్‌వాడీ టీచర్లను మినహాయించాలి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్

రంగారెడ్డి, జూన్ 12(నమస్తే తెలంగాణ) : మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్‌వాడీ టీచర్లను మినహాయించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ పనిభారంతో సతమతమవుతున్నారని, ఐసీడీఎస్‌కు సంబంధంలేని సర్వేతో ప్రభుత్వం మరింత ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎలక్షన్స్‌లో విధులు నిర్వర్తించిన బీఎల్‌వోలకు డబ్బులు చెల్లించాలంటూ డీడబ్ల్యూవో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు పద్మ, బేబీ, బాలమణి, వైదేహి, సీఐటీయూ జిల్లా నాయకులు పోచమోని కృష్ణ, ఎల్లేశ్ తదితరులు ఉన్నారు.



అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు